క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

కొడంగల్ రూరల్: రక్తదానం మరొకరికి ప్రాణ దానం, రక్తం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలని బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీ లాహోటీ నివాసంలో జియో లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని, రక్తదానం చేయాలని కోరారు.

తాండూరు సీఐగా సంతోష్ కుమార్



ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన సీఐ

తాండూరు టౌన్: తాండూరు పట్టణ సీఐగా సంతోష్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన సీఐ రాజేందర్ రెడ్డి వెయిటింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఛార్జి తీసుకున్న నూతన సీఐ.. ఐజీ కార్యాలయం నుంచి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం సీఐ, ఎస్పీ కోటిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

గ్రామాభివృద్ధికి కృషి



జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి తదితరులు

దోమ: ప్రజల ఆశీర్వాదంతో గడిచిన ఐదేళ్ల పాలన కాలంలో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేశామని పోతిరెడ్డిపల్లి సర్పంచ్ వర్త్య లక్ష్మి అన్నారు. పోతిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధికి సహకరించిన వారందరికీ.. ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కావలి గోవర్ధన్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన సీమ మాసయ్య బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు శివరాములు.. కమిటీ సభ్యులతో కలిసి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.8వేల ఆరు వందలను ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బచ్చయ్య, ఉప సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచులు మొగులయ్య, నారాయణ, మత్స్య సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాసయ్య, సంఘ నాయకులు సాయన్న, చంద్రమౌళి, శంకర్, రాంచంద్రయ్య, తిరుపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

పదవీకాలం పూర్తి సంతృప్తినిచ్చింది

సర్పంచ్ రాజిరెడ్డి



గ్రామ పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: గ్రామ పంచాయతీకి రావాల్సిన గ్రాంట్స్ పూర్తి స్థాయిలో అందకపోయినా, పాలనపరంగా సమస్యలు తలెత్తకుండా ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోవడం చాలా సంతృప్తినిచ్చిందని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. గురువారం దోమ జీపీ కార్యాలయంలో కార్యదర్శి ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో కలిసి సాధారణ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా ప్రజలకు అన్ని రకాల సేవలు అందించామన్నారు. నీటి వసతి, తడి, పొడి చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడూ శుభ్రపరిచేసేలా చర్యలు చేపట్టి, ప్రజల మన్ననలు పొందానని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన హరితహారం, క్రిమిటోరియం, డంపింగ్ యార్డ్, నర్సరీ నిర్వహణ, క్రీడా ప్రాంగణం లాంటి పనులను పూర్తి చేశానని పేర్కొన్నారు. ఇందులో ప్రజల సహకారం మరచిపోలేనిదన్నారు. ఇందులో ఉపసర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు నిరోష, మైను, రమేశ్, వసంతరావు, గౌస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు షురూ

మొయినాబాద్: గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ రత్నం పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధి మోత్కుపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు, జీపీ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు.



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



తాండూరు టౌన్: తహసీల్ కార్యాలయ ఆవరణలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న, తహసీల్దార్ తారాసింగ్



మోమిన్‌పేట: ప్రతిజ్ఞ చేయిస్తున్న, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

'ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. అది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ. దానిని ఎవరు కూడా దుర్వినియోగం చేయొద్దు. ప్రలోభాలకు లోను కాకుండా.. సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలి' అని పలువురు అధికారులు సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తహసీల్దార్లు.. సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు తీశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని కోరారు

– సాక్షి, నెట్‌వర్క్



దోమ: సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న, అధికారులు



తాండూరు టౌన్: పట్టణంలో ర్యాలీ తీస్తున్న, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు



మర్పల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న, తహసీల్దార్ గణేశ్



పెద్దేముల్: ర్యాలీ నిర్వహిస్తున్న, అధికారులు



బంట్వారం: కోటపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న, బంట్వారం, కోటపల్లి తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి తదితరులు

'మీరే మాకు స్ఫూర్తి'



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న, తహసీల్దార్

కుల్కచర్ల: 'మీరే మాకు స్ఫూర్తి. నేటి యువతరం మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి' అని తహసీల్దార్ ప్రభు యువతకు సూచించారు. ఓటరు జాతీయ దినోత్సవం సందర్భంగా 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చౌడాపూర్ గ్రామానికి చెందిన అమ్మపురం రామయ్య, బుక్క బురాన్ ఓటర్లను చౌడాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్, తదితర అధికారులు సన్మానించారు.

శివ దీక్షలు ప్రారంభం

ధారూరు: శివ దీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం తెల్లవారు జామున వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో.. ప్రథమ పూజ్యుడు మహా గణపతికి భక్తులు పూజలు చేసి, శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పూజారి చెన్న బసవయ్యస్వామి 11 మంది భక్తులకు శివమాలను వేశారు. మాల ధరించిన భక్తులు.. 41 రోజుల పాటు శివదీక్షను కొనసాగించనున్నట్లు పూజారి పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీఓ

మర్పల్లి: ఎంపీఓగా బి.సుశీల్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి చాంబర్‌లో విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆయన బదిలీపై మర్పల్లికి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎంపీఓ మహేశ్‌కుమార్.. బదిలీపై బొంరాస్‌పేట్ మండలానికి వెళ్లారు.

పత్తి చెట్లను తొలగించండి..

- పంటకు గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం
- మండల వ్యవసాయ అధికారి జయశంకర్

మోమిన్‌పేట: పత్తిని ఏరిన తరువాత మొక్కలను తొలగించాలని, లేని యెడలా వచ్చే ఏడాది పంటకు గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి జయశంకర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడారు. గత నవంబరులో కురిసిన వర్షానికి పత్తి చెట్లకు ఆకులు రావడం వలన, భూసారాన్ని పూర్తిగా మొక్కలు తీసుకుంటాయని వివరించారు. అందుకే వెంటనే వాటిని తీసివేయాలని స్పష్టం చేశారు. భూమి కొంత మేర ఎండిన వెంటనే.. లోతుగా దున్నుకోవాలన్నారు. లోతుగా దున్నడం వలన భూమిలో ఉండే పురుగులు, అవి పెట్టిన గుడ్లు పూర్తిగా ఎండకు నశించిపోతాయన్నారు. అంతే కాకుండా రానున్న వేసవిలో కురుసిన వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుందని తెలిపారు. దీని వలన విత్తనం నాటడానికి ముందు కొద్దిగా వాన పడితే చాలు, విత్తనం మొలకెత్తేందుకు అవకాశం ఎక్కువగా ఉందని చెప్పారు.

ట్రాక్టర్‌తో దున్నితే మేలు

గొర్రుతో దున్నితే వర్షపు నీరు భూమిలోకి ఎక్కువగా పోదని, ట్రాక్టర్‌తోనే ఎక్కువ మేలని సూచించారు. వానాకాలం సాగుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. కొంతమంది రైతులు ఇప్పుడు దున్ని, వేసవిలో వర్షాలు పడితే.. మళ్లీ దున్నాల్సి వస్తుందని, ఖరీఫ్‌కు ముందు దున్నుకోవడం చేస్తున్నారని పేర్కొన్నారు. అలా చేయడం వలన భూమి సారవంతం కోల్పోయి, దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు.

పంటలకు సస్యరక్షణ చర్యలు ముఖ్యం

- వరికి అగ్గి తెగులు సోకే ప్రమాదం ఉంది
- వ్యవసాయ శాస్త్రవేత్త యమున

ధారూరు: ఇనుపధాతు లోపం వలన వరిలో ఆకులు పసుపుపచ్చగా మారుతున్నాయని, వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున అన్నారు. ధారూరు మండలం గట్టెపల్లి, రుద్రారం, ధారూరు, రాంపూర్‌తండా, అవుసుపల్లి గ్రామాల్లో వరి, వేరుశెనగ పంటలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఇనుపధాతు నివారణకు 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ మందును, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. లేదా అరకిలో ఫెర్రస్ సల్ఫేట్ గుళికలను ఎకరా పొలంలో చల్లుకోవాలని చెప్పారు.

చలితో జాగ్రత్త

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరికి అగ్గి తెగులు సోకే అవకాశం ఉన్నందున సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. చలి ఎక్కువగా సమయంలో జింక్ లోపం కన్పిస్తుందని, పంటపై జింక్ సల్ఫేట్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వెల్లడించారు. వేరుశెనగ మరో రోజుల్లో కోత దశకు వస్తుందని, ఊడలు దిగుతున్న దశలోనే ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను మొక్కల మొదళ్ల దగ్గర వేసి, మట్టిని ఎగదోయాలని చెప్పారు. ప్రస్తుత పంటలకు టిక్క ఆకుమచ్చ తెగులు సోకిందని, దీని నివారణకు 2 గ్రాముల క్లోరోథాలోనిల్ లేదా ఒక మిల్లీ లీటర్ టెబ్యుకొనజోల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ధారూరు వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్, రైతులు ఉన్నారు.



గట్టెపల్లిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నూనెగింజల సాగు భలే

- ఆసక్తి చూపుతున్న రైతులు
- తెల్ల కుసుమతో ఆరోగ్యానికి మేలు
- మార్కెట్‌లో దీనికి డిమాండ్



షాబాద్: నూనె గింజల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో దీనికి డిమాండ్ ఉండటమే కాకుండా ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీంతో రైతులు స్వచ్ఛమైన నూనెకోసం ఈ నూనె గింజల సాగుకు మక్కువ చూపుతున్నారు. షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ, ఎర్రోనిగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామాల్లో 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్ 746 రకం కుసుమ విత్తనాలు సాగు చేసినట్లు వ్యసాయ అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో వేసే ఈ పంటల సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యతలేని నకిలీ నూనెలు కుప్పలు తెప్పలుగా మార్కెట్లోకి వస్తున్న నేపథ్యంలో.. వినియోగదారుడు ఏ నూనెను ఉపయోగించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గతంలో ఏ ఇంట చూసినా తెల్ల కుసుమల నూనె ఉపాయోగించేవారు. దీంతో ఏడాదిపాటు అవసరమైన ఈ నూనెను నిల్వ చేసుకునే వారు. తెల్లకుసుమ పంట సాగు తగ్గడంతో పరిస్థితిలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్ల కుసుమను తెల్లజొన్న, శనగ పంటలో అంతర పంటగా సాగు చేసేవారు. అయితే మండలంలో పత్తిసాగు పెరగడం తెల్ల కుసుమ సాగు తగ్గింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీనీ రబీ పంట కాలం ముగిసే వరకు అధిక దిగుబడి ఇస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతుంది. పత్తి సాగుతో ముఖ్యంగా మండల ప్రజల ఆహార పంటైన తెల్లజొన్న, శనగ సాగును తీవ్రంగా దెబ్బతీసింది. తెల్ల కుసుమ సాగుకు ప్రభుత్వ పోత్సాహం లభించడంలేదు. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాలుకు రూ. 6వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ.450లు పలుకుతుంది. గానుగాడించి తీసిన నూనె ఆరోగ్యానికి ఎంతో మేలైంది. ఈ నూనెను కొందామన్నా మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో, లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. వారి వద్ద సైతం డిమాండ్ మేరకు లభించడంలేదు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్ల కుసుమ సాగును వ్యవసాయాధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా పాంబండ క్షేత్ర గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ హిందుత్వాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. గురువారం మండల పరిధి బండవెల్కిచర్లలో శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ.. సనాతన ధర్మాలను కాపాడుకునేందుకు సంఘటితంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. 13 నెలలుగా గిరి ప్రదక్షిణను నిర్వహించడం అభినందనీయమన్నారు.

అయోధ్య కరసేవలకు సన్మానం

అయోధ్య ఆలయ నిర్మాణ కోసం నాడు కరసేవకులుగా కృషి చేసిన పలువురికి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. 500 ఏళ్ల భారతీయుల కల నెరవేరడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది దేశ ప్రజలకు గర్వకారణమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణ, కమిటీ కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, ఆలయ అర్చకుడు పాండు, కమిటీ సభ్యులు పెంటయ్య, నర్సింహారెడ్డి, నవీన్ రెడ్డి, మైపాల్, శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్, శేఖర్ పాల్గొన్నారు.

బస్టాప్‌లోకి వెళ్లేదెలా..?


ప్రయాణప్రాంగణం ఎదుట భారీ గుంత



ప్రయాణప్రాంగణం ముందు తవ్విన గుంత

దౌల్తాబాద్: మండల పరిధి పోల్కంపల్లి గ్రామ ప్రయాణప్రాంగణానికి అడ్డుగా కొందరు జేసీబీతో గుంత తీశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం వేచి చూసేందుకు అందులోకి వెళ్లే దారిలేక, ఎండలోనే నిరీక్షిస్తున్నారు. అంతే కాకుండా బస్టాప్ ఎదురుగా ఉన్న చేతి పంపు చుట్టూ గతంలో ఇలాగే గొయ్యి తీయడంతో అది నిరుపయోగంగా ఉండిపోయిందని స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. గ్రామపంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు తీసిన వారిపై తగిన చర్యలు చేపట్టి, వాటిని పూడిపించాలని కోరుతున్నారు.

రూ.300 కోట్లతో అభివృద్ధి పనుల నివేదిక



వెంకట్‌రెడ్డికి నివేదికను అందజేస్తున్న, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు

కొడంగల్ రూరల్: మున్సిపల్ అభివృద్ధికి రూ.3వందల కోట్లతో సిద్ధం చేసిన నివేదికను, గురువారం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డిలు అందజేశారు.

అభివృద్ధి పనులు ఇవే..

తాండూరు–కొడంగల్ రోడ్డు మధ్యలో విద్యుత్ దీపాల అలంకరణ, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, మురుగు కాల్వల నిర్మాణాలు, సీసీరోడ్లు, షాదీఖానా నిర్మాణం, పాత భవనాల కూల్చివేత తదితర అంశాలు ఉన్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి శ్రమించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ముఖ్యంగా విద్యా, వైద్య సౌకర్యాల కల్పనకు పాటుపడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికోసం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్‌బీ, మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, చంద్రశేఖర్, అంజనేయులు, సత్యనారాయణ రెడ్డి, పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ స్థాయి కన్వీనర్ల శిక్షణా శిబిరానికి షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. ధనిక రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని చెప్పారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు చేపట్టిన బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, జగదీశ్వరప్ప, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే ఉత్తమ ఫలితాలు

మొయినాబాద్ రూరల్: కృషి, పట్టుదలతో పరిశోధనలు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో 'డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ ఇండోల్ డెరివేటివ్స్ యాజ్ యాంటీ కన్సర్ ఏజెన్స్' అనే అంశంపై రిజిస్ట్రార్ ఆచార్య రవీంద్ర పర్యవేక్షణలో బోడ సునీత చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

'బీఎల్‌ఏ'కు తరలిన కాంగ్రెస్ నాయకులు



అనంతగిరి: తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

అనంతగిరి: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ 'బూత్ లెవల్ ఏజెంట్ల' సన్నాహక సమావేశానికి గురువారం వికారాబాద్ పట్టణం నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డుల వారీగా సభకు వెళ్లారు.

యాలాల నుంచి..

యాలాల: బీఎల్ఏ(బూత్ లెవెల్ ఏజెంట్స్) సమావేశానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామని వెల్లడించారు.



యాలాల: శ్రీశైలం పాదయాత్రకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

ఇదిలా ఉండగా.. తాండూరు నుంచి అమరవీరుల స్థూపం వరకు పాదయాత్ర చేస్తున్న ఉద్యమకారుడు శ్రీశైలంకు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యమకారులకు సముచిత స్థానంతో పాటు నామినేటెడ్ పోస్టులు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించనుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశానికి వెళ్లిన వారిలో పార్టీ నాయకులు రాజేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, కోలుకుంది హన్మంతు, నాగయ్య, మైనొద్దీన్, మారుతీ, మోయిజ్, ఖాసిం, అశోక్, సత్యనారాయణ, అంజిలయ్య ఉన్నారు.